క్లుప్తంగా

రేపు తిరు కల్యాణం

జగద్గిరిగుట్ట: భోగి పండుగ(14వ తేదీ)ను పురస్కరించుకుని జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం, గోవిందరాజస్వామి ఆలయంలో తిరు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

22న ఎస్ఎస్ఆర్‌డబ్ల్యూ అసోసియేషన్ ఎన్నికలు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని షిరిడీహిల్స్‌లో శ్రీసాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ (ఎస్ఎస్ఆర్‌డబ్ల్యూ) అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 22 ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్ష పదవికి పోటీపడుతున్న ప్రధాన అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేస్తూ ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు బహుజనులు ఏకమవ్వాలి

జగద్గిరిగుట్ట: రాజ్యాంగ పరిరక్షణకు బహుజనులంతా ఏకమై పోరాడాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యేసురత్నం అన్నారు. గురువారం జగద్గిరిగుట్టలోని నల్లమల గిరిప్రసాద్ విజ్ఞాన కేంద్రంలో దళిత హక్కుల పోరాట సమితి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమితి అధ్యక్షుడు దుర్గయ్య ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య రక్షణ, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన విషయమై అవగాహన సదస్సు నిర్వహించారు.

- ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసురత్నం, సీపీఐ మండల కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాస్తున్నాయని అన్నారు. భావప్రకటన స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛలపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు ద్వారా బహుజనులంతా ఏకమై తగిన ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.
- ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఎంఎఫ్‌ఐడబ్ల్యూ నియోజకవర్గ అధ్యక్షురాలు హైమవతి, ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్‌రావు, బాబు, నర్సయ్య, సహదేవరెడ్డి పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



దుండిగల్: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బౌరంపేట్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలో తరగతులు నిర్వహించడంతో పాటు, డీఈవో, కలెక్టర్, తహసీల్దార్‌లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికబద్ధంగా కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థుల ఉన్నతికై ఉపాధ్యాయులు నిరంతరం పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మదన్‌రెడ్డి, ప్రదీప్‌రావు, రాజేష్, పద్మప్రియ, భాస్కర్‌గౌడ్, రేణుక, రాజు, రాజేందర్, సుజాత, మహితారాణి, రామకుమారి, విజయలక్ష్మి, గీత, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



కుత్బుల్లాపూర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం మేడ్చల్ కండ్లకోయలో నిర్వహించిన శ్రీలక్ష్మీనరసింహ చతుర్వేద మహాయాగంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాగం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో బైక్‌ను ఢీకొట్టిన ఆటో డ్రైవర్

బోల్తా పడిన ఆటో.. ఇద్దరికి గాయాలు

జీడిమెట్ల: మద్యం మత్తులో ఆటో నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఆటో సైతం బోల్తా పడిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ రోడామేస్త్రీనగర్‌కు చెందిన షానవాజ్(36) గురువారం తన ద్విచక్రవాహనంపై షాపూర్‌నగర్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడ వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఓ ఆటో షానావాజ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం ఆటో సైతం బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటో నడుపుతున్న డ్రైవర్ పవన్ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.






సాక్షి, సత్‌జ్ఞాన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో రంగవల్లులు వేస్తున్న మహిళలు

ముగ్గుల పూదోట సంక్రాంతి శోభ





సంక్రాంతి సంబరాల్లో భాగంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రెండు రోజుల ముందుగానే కుత్బుల్లాపూర్‌లో పండుగ వాతావరణం కనిపించింది. సాక్షి, సత్‌జ్ఞాన్ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేశారు. గురువారం మధ్యాహ్నం చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్ ఆవరణలో ప్రారంభమైన ఈ కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జీడిమెట్ల సీఐ పవన్, సత్‌జ్ఞాన్ హైస్కూల్ అధినేత చింతల మల్లేశం యాదవ్, స్కూల్ ఫౌండర్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్‌లు బహుమతుల ప్రదానం చేశారు. మొత్తం 75 మంది మహిళలు ముగ్గులు వేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి షీల్డ్‌లు ప్రదానం చేశారు.

విజేతలు వీరే...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వరనగర్ సత్‌జ్ఞాన్ స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలో తమదైన శైలిలో ముగ్గులు వేసి బహుమతులు పొందిన వారి జాబితా ఇలా ఉంది. ప్రథమ బహుమతి జి.గంగ, ద్వితీయ బహుమతి కె.మహాలక్ష్మి, తృతీయ బహుమతి పి.శ్రీలక్ష్మికి వరించింది. కన్సోలేషన్ బహుమతులు బి.అర్చన, కె.భవ్య, ఎస్.సాధన, కె.సుజాత, శ్వేత ఐదుగురిని ఎంపిక చేసి వారికి చీరలు పంపిణీ చేశారు. న్యాయ నిర్ణేతలకు సునీత, ప్రవీణ, ద్రాక్షాయని, శివకుమారీలు వ్యవహరించారు. సంక్రాంతి పాటలకు డాన్సులు... సంక్రాంతి సంబరాలను ఉట్టిపడేలా విద్యార్థులు డాన్సులతో అదరగొట్టారు.



గొబ్బెమ్మ, గంగిరెద్దుల ఆటలు, పలు నృత్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

చాలా సంతోషంగా ఉంది..



సాక్షి ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి ముగ్గుల పోటీలు సంతోషం అనిపించింది. ప్రతి ఏటా మా స్కూల్లో సంబరాలు చేస్తూ వస్తున్నాం. ఇంత పెద్ద ఎత్తున మహిళలు హాజరవుతారని అనుకోలేదు. వచ్చే సంవత్సరం కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేస్తాం. మాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు.

– చింతల మల్లేశంయాదవ్, సత్‌జ్ఞాన్ స్కూల్ అధినేత



గంగకు మొదటి బహుమతి అందజేస్తున్న జీడిమెట్ల సీఐ పవన్



మహాలక్ష్మికి ద్వితీయ బహుమతి అందజేస్తున్న పాఠశాల అధినేత చింతల మల్లేశంయాదవ్



శ్రీలక్ష్మికి తృతీయ బహుమతి అందజేస్తున్న పాఠశాల ఫౌండర్ విజయలక్ష్మి



కన్సోలేషన్ గిఫ్ట్‌లు పొందిన ఐదుగురు మహిళలు




సత్‌జ్ఞాన్ స్కూల్ ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు, విద్యార్థులు




సంక్రాంతి సంబరాల్లో భాగంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఏడాదిలో 150 రోజుల పనిదినాలు కల్పించాలి

సీఐటీయూ సీనియర్ నాయకుడు వెంకటరామయ్య

నిజాంపేట్: అసంఘటితరంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చేసిందేమీ లేదని నిజాంపేట్ కార్పొరేషన్ 3వ వార్డు కార్పొరేటర్, సీఐటీయూ సీనియర్ నాయకుడు వెంకటరామయ్య అన్నారు. బెంగళూరులో ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలు జరుగనున్న నేపథ్యంలో బుధవారం నిజాంపేట్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటరాజ్యం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వెంకటరామయ్య, చంద్రశేఖర్, వెంకటరాజ్యం మాట్లాడారు.

- దేశంలో 70 శాతం అసంఘటితరంగ కార్మికులు ఉన్నా వారు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో చిక్కుకున్నాయని విమర్శించారు. కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.



నిజాంపేట్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ వెంకటరామయ్య, నాయకులు

- అసంఘటిత రంగ కార్మికులకు సంవత్సరంలో 150 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ మహాసభల్లో కార్మికుల ఉద్యోగ భద్రత, సమస్యలపై చర్చించి భవిష్యత్‌లో చేపట్టబోయే ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటయ్య, లింగమ్మ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం



నూతన వేతన ఒప్పందం కుదుర్చుకున్న టీఆర్ఎస్‌కేవీ నేత మదన్‌గౌడ్

సుభాష్‌నగర్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని టీఆర్ఎస్‌కేవీ నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని మంగాయిపల్లి ఇండస్ట్రీ ఏరియాలో నోబెల్టెక్స్ స్పెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మొట్టమొదటిసారిగా యూనియన్ అధ్యక్షుడు మదనగౌడ్ ఆధ్వర్యంలో గురువారం నూతన వేతన ఒప్పంద అగ్రిమెంట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు రూ.4వేల వేతన పెంపుదల, నైట్‌షిఫ్ట్ అలవెన్స్ రూ.75, వాషింగ్ బ్యాలెన్స్ రూ.500, చిల్డ్రన్స్ ఎడ్యూకేషన్‌కు రూ.2వేలు, యథావిధిగా బోనస్, రెండు జతల షూస్, డ్రెస్సు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కంపెనీ చరిత్రలో 36 మంది కార్మికులను పర్మినెంట్ చేశామని తెలిపారు. ఈ అగ్రిమెంట్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రమోద్‌రెడ్డి సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ మహేందర్, జనరల్ సెక్రటరీ విఠల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, ట్రెజరర్ రాజు, కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నిర్వహణ మరిచారు..

సుభాష్‌నగర్: సుందరీకరణ చేసిన చెరువు నిర్వహణను మర్చిపోయారు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు బూడిదలో పోసిన పన్నీరు అన్న చందంగా మారుతున్నాయి. గాజులరామారంలోని చింతల్ చెరువును సుందరీకరణ చేసి గతేడాది జనవరి 25న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇక అక్కడితో సరిపోయిందనుకున్నరో ఏమో అధికారులు.. ఆపై చెరువు నిర్వహణ చూడకపోవడం.. కట్టకు ఇరువైపులా పెట్టినా చెట్లకు ట్రీగార్డులు ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు ఆహారంగా మారాయి. అధికారులు స్పందించి చెరువు బాగోగులు చూసేందుకు సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



చెరువు వద్ద నాటిన మొక్కలను మేస్తున్న పశువులు

శుభాకాంక్షలు

తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన మాణిక్‌రావ్ ఠాక్రేను గురువారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాణిక్‌రావ్ ఠాక్రేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

– సుభాష్‌నగర్



చైనా మంజాలతో ప్రమాదం

సుభాష్‌నగర్: సంక్రాంతి సెలవుల సందర్భంగా విద్యార్థులు గాలిపటాలు ఎగరవేయడం ఆనవాయితీగా వస్తోందని.. కాని దుకాణదారులు ప్రభుత్వం నిషేధించిన చైనా మంజాలను విక్రయించడంతో ప్రమాదాలకు ఆస్కార మేర్పడుతోందని జాగృతి అధ్యక్షురాలు శివపార్వతి అన్నారు. గురువారం షాపూర్‌నగర్ జడ్పీహెచ్ఎస్, సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాగృతి సంస్థ నాయకులు మాట్లాడుతూ.. చైనా మంజాలతో పతంగులు ఎగురవేసే క్రమంలో రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారుల మెడల, చేతులకు చుట్టుకుని కోసుకుపోవడంతో తీవ్రంగా గాయపడిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. చైనా మంజాలు విక్రయించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

- అదే విధంగా సెలవులకు ఊళ్లకు వెళ్లే చిన్నారులు చెరువుల్లో దిగుతూ ఈత రాకపోకపోవడంతో నీటమునిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయమై అప్రమత్తంగా ఉండాలని కోరారు. అదే విధంగా దొంగతనాలు జరగకుండా పండగకు వెళ్లే ప్రజలు జాగ్రత్త పడాలన్నారు. విలువైన బంగారు ఆభరణాలు, నగదును బ్యాంక్‌లో, బంధువుల ఇళ్లలో భద్ర పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండీ అఖిల్, అరవింద్, నందు, ప్రవీణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



నార్త్ సిటీ హైస్కూల్‌లో మంజాపై అవగాహన కల్పిస్తున్న జాగృతి అధ్యక్షురాలు శివపార్వతి



భగత్‌సింగ్‌నగర్‌లో కోడి ఆదిత్య ఆధ్వర్యంలో వేడుకలు



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



జగద్గిరిగుట్టలో విద్యార్థి జేఏసీ నాయకుడు సాయికుమార్ పంతుల ఆధ్వర్యంలో నివాళులర్పిస్తూ..

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన..

మహోన్నత వ్యక్తి వివేకానందుడు

దేశప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద జయంతి గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు యువజన సంఘాలు, సంక్షేమ సంఘాలు, రాజకీయ పక్షాలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. హైందవ సంప్రదాయాన్ని.. భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి వివేకానందుడని అన్నారు. అదే విధంగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 'నేషనల్ యూత్ డే'ను ఘనంగా నిర్వహించారు. వివేకానంద యువతకు నిత్య చైతన్య స్ఫూర్తిప్రదాత అని అభివర్ణించారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

– రంగారెడ్డినగర్



రంగారెడ్డినగర్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ప్రగతినగర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు